

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# సంస్కృత కావ్యాలు – పర్యావరణ స్పృహ

– డా. నందవరం మృదుల
సహాయాచార్యులు–తెలుగు శాఖ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట (స్వయం ప్రతిపత్తి)
హైదరాబాద్

'ఆత్మవత్ సర్వభూతాని' అన్నది ఉపనిషద్వాక్యం. సర్వభూతములు మనవంటివే. మానవశరీరం పాంచభౌతికమైనది. మనకు తెలిసో, తెలియకో ఎప్పుడూ మానవశరీరం పంచభూతాలకు దగ్గరగా ఉండాలని చూస్తుంది. చల్లనిగాలి, స్వచ్ఛమైన నీరు, చక్కని నేల, రంగుల ఆకాశం మనల్ని ఆకర్షిస్తూనే ఉంటుంది. 'పృథ్వ్యప్ తేజో వాయు రాకాశ' ములతో ఆవరింపబడిన పర్యావరణమే మన నిజమైన ఆవాసము. ఈ ఆవాసాన్ని దాటి మనం మనలేము. ప్రాణికోటి నిలవటానికి కలుషితం కాని భూమి, జలము, వాయువులు కావాలి. అందుకు భూమికి కావలసిన 'చెట్లు' జలముకు కావలసిన 'చెట్లు', వాయువుకు కావలసిన 'చెట్లు' సంరక్షింపబడవలసిందే.

నాగరికత పేరుతో పరిశ్రమల ఏర్పాటు, ఆధునిక ఆవాసాలు, నగరీకరణ మొదలైన వాటితో పర్యావరణం దెబ్బతింటున్న సమయంలో పర్యావరణ పరిరక్షణ గురించి మనం మాట్లాడుకోవడం ఆలోచన చేయడం మన ధర్మం. కాని ఇటువంటి వాతావరణమే లేని సమయంలో ప్రకృతి –పర్యావరణం పై ప్రత్యేకదృష్టిని సారించింది మన భారతీయ సాహిత్యం. అందునా సంస్కృత సాహిత్యానిది తొలి పెద్దపీట.

ఏ చట్టాలు లేని సమయంలో మన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు మనకు మార్గనిర్దేశం చేసే రాజ్యాంగం లాంటివి. మన ఋషులు, కవులు – ఈ నాలుగు స్థంభాలపై భారతీయ (ప్రపంచ) సమాజాన్ని నిలబెట్టాయి. 'వసుధైక కుటుంబ' భావనను పెంచాయి. ఇటువంటి వాటిని కేవలం మనం మత గ్రంథాలుగా చూచినట్లయితే మనల్ని మనం చాలా కోల్పోయినట్లే. వాటిని కాలానుగుణంగా నిలిచిన దివిటీలుగా భావిస్తే, మన బంగారు భవిష్యత్తుకై అవి ఎంతగా పరితపించిపోయాయో అవగతమౌతుంది.

ప్రభుసమ్మితాలైన వేదాలు, మిత్రసమ్మితాలైన పురాణాల యొక్క సారములైన కావ్యాలను పరిశీలించినట్లయితే మానవ మనుగడ సుభిక్షంగా సాగడానికి ధ్వన్యాత్మకంగా చెప్పిన సందర్భాలు అనేకం కనిపిస్తాయి. వాటిని మన జీవన విధానానికి తగిన విధంగా అన్వయం చేసుకుంటే, మనం అనుభవిస్తున్న ప్రకృతివనరులు మన తరువాతి తరాలకు కూడా అందించిన వారిమౌతాము. లేకపోతే భవిష్యత్తులో ప్రాణులు స్వచ్ఛమైన గాలికోసం, నిర్మలమైన నీటికోసం విపరీతంగా తపించిపోవలసి వస్తుంది. మనం అందుకున్న సహజ వనరులను, మన పిల్లలకు అసలైన ఆస్తిగా అందించ వలసిన కనీస బాధ్యత మనకున్నది.

ఈ సందర్భంలో సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే ప్రాచీన ఆధునిక కవులందరూ ప్రకృతి ప్రేమికులుగా కనిపిస్తారు. ప్రకృతి కలిగిఉండే సౌకుమార్యమే మానవులు కూడా కలిగి ఉండాలన్నది ఆవర్ణనలోని ఆంతర్యం. భారతీయ సాహిత్యానికి ఆదిగురువైన సంస్కృత సాహిత్యాన్ని ఈ కోణంలో పర్యావలోకనం చేసినప్పుడు, కవులు తాము ఎంచుకున్న ఇతివృత్తాలలో పర్యావరణ రక్షణ బాధ్యతను రాజధర్మంగా సూచిస్తారు. ఎందుకంటే ఆశ్రమజీవితం గడిపే మునుల సంరక్షణ రాజు యొక్క కార్యం కాబట్టి ఆ మునులకు ఆశ్రయభూతములైన వనాలను రాజు కాపాడాలి.

వాల్మీకి కృతమైన శ్రీమద్రామాయణము – అయోధ్యాకాండ – 67వ సర్గలో

'నారాజకే జనపదే నరాః శాస్త్ర విశారదాః।
సంవదంతోఽవతిష్ఠంతే వనేషూపవనేషుచ॥ 26 శ్లో.

'రాజులేని రాజ్యంలో – శాస్త్రాలలో ఆరితేఱిన పండితులు, శాంతిలేకపోవడంతో మున్యాశ్రమ ప్రదేశాలయందుగాని, ఉపవనాలయందు గాని శాస్త్రచర్చలు చేయరు' అని భావం. అంటే నగర ప్రజల యొక్క


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

బాధ్యతేకాక వనాలలో నివసించే వారి బాధ్యత కూడా రాజే వహించాలి. అంతేకాదు, ఎక్కడైతే మున్యాశ్రమాలు చక్కగా నిర్వహించబడతాయో అక్కడి వనమృగములు సహజ వైరాన్ని మాని స్నేహభావాన్ని కలిగి ఉంటాయి. స్వేచ్ఛగా జీవిస్తాయి.

'అభిజ్ఞాన శాకుంతలమ్'లో కాళిదాసు 'గాహన్తాం మహిషా నిపానసలిలం శృఙ్గైర్ముహుస్తాడితం, ఛాయాబద్ధకదమ్బకం మృగకులం రోమన్థమభ్యస్యతు, విస్రబ్ధం క్రియతాం వరాహతతిభి ర్ముస్తాక్షతిః పల్వలే', (ద్వి.అం.శ్లో 6)

'వనమహిషాలు తమ తమ కొమ్ములతో మాటి మాటికి నీటిని కొట్టుచు నీటిలో మునుగుగాక! చెట్లనీడలో యథేచ్ఛముగా కూర్చొని లేళ్ళగుంపులు నెమరు వేయునుగాక! వరాహములు నీటిగుంటలలో విశ్వాస పూర్వకముగా తుంగ గడ్డలను త్రవ్వి తినునుగాక!' అన్నది పై శ్లోకభావం వనాలు సంరక్షింపబడితే వన్యప్రాణులు ఎంత ఆహ్లాదంగా జీవిస్తాయో కవి ఇక్కడ కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నాడు.

రఘువంశం కావ్యంలో–

'పురుహూతధ్వజస్యేవ తస్యోన్న యన పంక్తి యః

నవాభ్యుత్థానదర్శిన్యో ననందుః సప్రజాః ప్రజాః (చ.సర్గ–శ్లో3)

రఘుమహారాజు యొక్క రాజ్యాన్ని వర్ణిస్తూ కాళిదాసు, ఆ రాజ్యంలో ప్రజలు తమ సంతానాన్ని వెంటబెట్టుకొని, ప్రతి సంవత్సరం, వర్షాలు పడడానికై చేసే 'ఇంద్రధ్వజోత్సవము' లో బారులుగా తీర్చిన ధ్వజాలను ప్రజలు రెప్పలార్చక చూస్తున్నారని భావము. అంటే వర్షాల కొరకు ప్రకృతిపరమైన పూజలు చేయడం ఈ సందర్భంలో గుర్తించవచ్చు. ప్రకృతిని స్వచ్ఛంగా ఉంచడం రాజధర్మాలలో ఒకటిగా మనం భావించవచ్చు.

కాళిదాసు కుమారసంభవంలో పార్వతిని ఒక ప్రకృతి కన్యవలెనే చిత్రిస్తాడు. శివుని కొరకు ఆమె తపస్సు చేయటానికై అరణ్యంలో ఆశ్రమాన్ని ఏర్పరచుకుంటుంది. అక్కడ ఆమె చెట్లను పెంచుతుంది. ప్రేమతో వాటికి నీళ్ళను పోస్తుంది. మక్కువతో లేళ్ళకు నీవారధాన్యాన్ని తినిపిస్తుంది. ఈ విధమైన పార్వతి తీరులో ప్రకృతిపై ఆమెకున్న ప్రేమభావన తెలియడమే కాక పాఠకునిలో పరోక్షంగా ప్రకృతిపై మక్కువను పెంచేదిగా ఉంటుంది.

వనదర్శనమే ఒక పవిత్ర కార్యమని తెలియజేస్తూ దుష్యంతుడు "సూత!చోదయాశ్వాన్, పుణ్యాశ్రమ దర్శనేన ఆత్మానం పునీమహే' అని ప్రథమాంకంలో అంటాడు.

శ్లో. నీవారాశ్శుకగర్భకోటరముఖభ్రష్టాస్తరూణామధః

ప్రస్నిగ్ధాః క్వచిదింగుదీఫలభిద స్సూచ్యంత ఏవోపలాః।

విశ్వాసోపగమాదభిన్నగతయశ్శబ్దం సహన్తే మృగాః

తోయాధార పథాశ్చ వల్కల శిఖానిష్యంద రేఖాంకితాః॥ (14)

'ఓ సూతా! ఈ తొఱ్ఱలలో వసించు చిలుకలు మున్యాశ్రమములలో బైరు చేయబడు నెవ్వరిధాన్యము గొనిపోయి తినుటలో జాతిపడి గింజలీచెట్ల క్రిందబడియున్నవి. చూడుము. అదిగో మిగుల నునుపెక్కియున్న ఈ బండలు గారకాయలను గొట్టుటకుపచరించుచున్నవి చెప్పకయ చెప్పుచున్నవి ఈ లేళ్ళు మన రథధ్వని వినియును ఏల చెదరి పాఱిపోకున్న వనుకొనియెదవు? తమకు ఇందెవ్వరి వలనను నెన్నటికి ఉపద్రవము గలుగదనెడి వీనినమ్మకము. ఇవిగో జలాశయమునకు పోయివచ్చెడు కాలిబాటలు గాబోలు ఇవి. స్నానము చేసివచ్చు వారి నారబట్టల కొసల నుండి నీళ్ళుగారిన గుర్తులు కలిగియున్నవి' అన్న భావనలో ఆశ్రమాలు ఎందరికి ఆశ్రయభూతమౌతున్నాయో మునుల వలన అక్కడి ప్రాణులు ఎంత నిర్భయత్వాన్ని కలిగి ఉంటున్నాయో అవగతం అవుతున్నది. వనాలలో సంచరించే వారి జీవనం కోసం వనాలు ఎలా సంరక్షింపబడుతున్నాయో బోధపడుతున్నది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

సంస్కృత సాహిత్యంలో మరొక గొప్ప కావ్యం బాణుని కాదంబరి (గద్యం). ఇందులోని ప్రతివాక్యము రమణీయమే. శాల్మలీ వృక్షాన్ని మనిషిగా భావించి వర్ణించిన తీరు అద్భుతం.

'పంపా సరోవరం పశ్చిమతీరాన ఒక పెద్ద బూరుగువృక్షం ఉన్నది. ఆ చెట్టు ఎన్నాళ్ళనాటిదో చెప్పలేము. రామబాణాలకు భగ్నమైపోయిన సప్తతాళవనం దానికి దాపులోనే ఉన్నది... ఆ చెట్టు కొమ్మలపై పాములు విడిచిన కుబుసాలు అనేకం గాలికి కదలాడుతూ పల్చటివస్త్రాలవలె కానవస్తాయి... చాలా పురాతమైన వృక్షం కనుక ఒకవేళ నేల కూలిపోతానేమోనన్న భయంతో అది ఆకాశాన్ని పట్టుకున్నట్లు తోస్తుంది. దేహం మీది రక్తనాళాలవలె అనేక తీగెలు ఆ చెట్టునిండా అల్లుకొని ఉంటాయి. వృద్ధాప్యంలో వంటిమీద మచ్చలు పుట్టినట్లు, దానిమీద అక్కడక్కడ ముళ్ళు కానవస్తాయి. ,...(38 పే) అని చేసిన వర్ణన చదివిన తరువాత ఏ చెట్టును చూచినా మనకు మనిషే గుర్తుకు వస్తాడు. అంతేకాదు 'ఎక్కడెక్కడి చిలుకలకూ నివాసంగా వున్నదది. ఆ చెట్టు కొమ్మలలో, రెమ్మలలో, చిగురు గుబుళ్ళలో, తొర్రలలో ఇక్కడి – అక్కడ అనే విచక్షణ లేకుండా అంతటా రంగురంగుల రామచిలుకలూ, ఇంకా ఇతర పక్షులూ గూళ్ళు కట్టుకుని నివసిస్తున్నాయి. అంత పెద్ద చెట్టుకనుక ఎవరూ ఎక్కలేరని, నిర్భయంగా వుండవచ్చునని అవి అక్కడ నివాసం ఏర్పరచుకుని వుండవచ్చు. గుంపులు గుంపులుగా చిలుకలు, వ్రాలి వుండడం వల్ల ఆ చెట్టు ఎప్పుడూ పచ్చగా కనిపిస్తుంది' గోపాలకృష్ణ, రెంటాల (కాదంబరి – వచన రచన, పేజి. 39) అని వర్ణించడం వెనుక ఒకచెట్టు ఎన్ని ప్రాణులకు నీడనిస్తుందో, ఒక చెట్టు వలన ఎన్ని ప్రాణులు బ్రతుకుతాయో మనకు బోధపడుతుంది.

వేటగాడి బారినుండి తప్పించుకుని చెట్టుపై నుండి కిందపడ్డ ఒక చిలుక పిల్లను జాబాలి మహర్షి కుమారుడు, హారీతుడు అనే మునిబాలకుడు చూచాడు. దాని అవస్థను చూచి అతనికి జాలి కలిగింది. 'పాపం రెక్కలురాని ఈ చిలుకపిల్ల ఏదో చెట్టుపైనుంచి పడి ఉంటుంది. లేదా ఏదైనా డేగనోట్లో నుంచి జారి పడిందేమో! ఎంతో ఎత్తునుంచి పడడం వల్ల కొనప్రాణంతో కొట్టుకుంటున్నది. కళ్ళు మూస్తూ తెరుస్తూ ఉన్నది. రొప్పుతున్నది. పదే పదే నోరు తెరుస్తున్నది. పాపం! ఊపిరిపోక ముందే దీన్ని నీటిదగ్గరికి తీసుకుని పోదాం' (పేజి 55) అని భావించాడు హారీతుడు. సరస్సు దగ్గరికి తీసుకెళ్ళి, అతనే చిలుకపిల్ల నోరు తెరిచి, (వ్రేలితో ఒకటి, రెండు చుక్కలు నీళ్ళు పోశాడు. దానికి ప్రాణాలు లేచి వచ్చాయి.... హారీతుడు. దానిని తీసుకుని ఆశ్రమానికి బయలుదేరాడు. జాబాలి మహర్షితో 'దీనులను కాపాడడం మనలాంటి వారికి ధర్మం కదా!' అంటాడు. (పేజి 56,57,58,59) ఈ ఘట్టం అంతా ప్రాణులపై మనం చూపవలసిన దయ, కరుణను తెలియజేస్తాయి. మనతో పాటు జీవిస్తున్న జీవుల యోగక్షేమాలు మనం కాక మరెవరు చూస్తారు? అన్న ఆలోచనను కలిగిస్తుంది. బౌద్ధ జాతకకథలు కూడా ఇటువంటి భావాలనే ప్రేరేపిస్తాయి.

భారవి మహాకవి కిరాతార్జునీయంలో సూర్యుని వర్ణన చేస్తూ...

ఉత్ఫుల్ల స్థల నళినీవనాదముష్మాదుద్ధూతః సరసిజ సంభవః పరాగః
వాత్యాభిర్వియతి వివర్తితః సమంతాదాధత్తే కనకమయాతపత్ర లక్ష్మీమ్

(సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 291)

స్థల నళినుల నుంచి లేచిన పరాగం గాలిచేత లేవగొట్టబడి ఆకాశంలో మండలాకారంగా వ్యాపించింది. అది సువర్ణసూత్ర నిర్మితమైన ఆతపత్రం (గొడుగు) యొక్క శోభను అనుకరిస్తున్నది. ఈ శ్లోకంలోని ఆతపత్ర భావన సుందరంగా వుండి భారవికి ఆతపత్రి భారవి అనే కీర్తిని తెచ్చిపెట్టింది.

రవిగాంచని చోట కవిగాంచును అన్నట్లు సూర్యునికి కూడా గొడుగు అవసరమనే (ఓజోన్ పొర) విషయాన్ని కవి ఆనాడే గుర్తించినట్టున్నారు. చుట్టూ ఉన్న ప్రకృతిలోని ప్రతి అంశము తమకు చెందినదే అనే భావన రాకపోతే

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in
Cover Page

ఇటువంటి వర్ణన అసాధ్యం.

భట్టికవి రాసిన భట్టికావ్యంలో 22 సర్గలున్నాయి. రాముని చరిత్ర ఇతివృత్తంగా కలిగిందిది. భట్టికవి అనేకచోట్ల భారవిని అనుకరించాడు.

'దరుత్తరేపంక ఇవాంధకారే మగ్నం జగత్ సంతత రశ్మిరజ్జుః।

ప్రనష్టమూర్తి ప్రతిభాగముద్యన్ ప్రత్యుజ్జహారేవ తతో వివస్వాన్॥

'సమస్త ప్రపంచం గాడాంధకారమనే బురదలో కూరుకునిపోగా ఉదయాచలం మీద ఉదయించే సూర్యుడు తన కిరణాలనే రజ్జువులను పరచి ప్రాణులను పైకి లాగుతున్నట్లున్నాడట!' (సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 296) ఇటువంటి శ్లోకం చదివినప్పుడు, విన్నప్పుడు మనసారా నమస్కరించాలనిపిస్తుంది. తనకు రక్షణలేకపోయినా మనకు ఆరోగ్య సంరక్షణనిస్తున్న ఆయన కోసం మనమేదైనా మార్గం వెతకాలికదా! అనిపిస్తుంది.

నీరు ఎంత ప్రాణాధారమో మేఘసందేశం ప్రథమసర్గలో మనం గుర్తించవచ్చు.

శ్లో. తత్రావశ్యం వలయకులిశోద్ఘట్ట నోద్గీర్ణతోయం

నేష్యన్తి త్వాం సురయువతయో యన్త్రధారాగృహత్వమ్।

తాభ్యో మోక్షస్తవ యది సఖే ఘర్మలబ్ధస్య నస్యాత్

క్రీడాలోలాః శ్రవణ పరుషైర్గర్జితై ర్భాయయేస్తాః॥ (ప్ర.స. 65 శ్లో)

'ఓ మేఘుడా! నీవు కైలాస ప్రాంతమునందు ప్రయాణము చేయుచుండగా దేవతా స్త్రీలు తమ చేతులకున్న కంకణములందు పొదగబడిన వజ్రములతో పొడిచి పొడిచి నీటిధారలను ఎగజిమ్ము జలయంత్రముగ నిన్ను నిజముగా మార్చెదరు. నీ చుట్టును చేరి, నీటిధారలతో తడిసి, ఆనందించుచుందురు. గ్రీష్మతాపముచే తపించిన వారిపై చల్లనినీరు చిలకరింపబడినచో ఆనందము నంది ఆ జనులు తమకు చల్లదనము నిచ్చినవానిని, కదలనీయకుండ చుట్టునుచేరి, నిలిపియుంచుట లోకసహజమే కదా! (జి.వి.యస్. సుబ్రహ్మణ్యశర్మ, 2001 పే. 27) వర్షపు నీటికై మానవులు ఎలా పరితపిస్తారో ఈ శ్లోకంలో కవి పరోక్షంగా తెలియజేస్తున్నాడు. వాన నీటిని ఎలా భావనచేయాలో భావుకులకు బోధచేస్తున్నట్లున్నది.

'కాళిదాసుకు అర్థశాస్త్ర, ధర్మశాస్త్ర, నీతిశాస్త్ర, కామశాస్త్ర అలంకార నాట్యశాస్త్రాలలో మంచి ప్రవేశమున్నది. జ్యోతిష, ఆయుర్వేద, ధనుర్వేదాలను కూడ అతడు బాగా తెలిసినవాడు. ఇంకా అతనికి సంగీత చిత్రకళాది లలిత కళలతోను పరిచయమున్నది. కాళిదాసుకు ఇతిహాస, భూగోళాదుల జ్ఞానం కూడ వున్నది. ఈ శాస్త్రజ్ఞానమే కాక లౌకిక జ్ఞానం కలవాడు. కాళిదాసుకు ప్రకృతి ప్రేమ, చుట్టూ వున్న ప్రదేశాలను, ప్రకృతి దృశ్యాలను ప్రకృతిలో జరిగే మార్పులను మానవ వ్యవహారాలను సూక్ష్మదృష్టితో పరిశీలించే శక్తి కూడ అతనికి ఉన్నది. తన చుట్టూ జరిగే విషయాలను అతడు ఆసక్తితో పరిశీలించే అనురాగ హృదయంగా కన్పిస్తాడు. తన పరిసరాలలో ఏమి జరుగుతుందో తెలుసుకోక కేవలం ఊహాలోకంలో శాస్త్రాధారంగా విషయాన్ని చెప్పేవాడు కాదు. అందుకే... కాళిదాసు శ్లోకాలలో ఎంతో లోకానుభవం, పరిశీలనాశక్తి ప్రకటమౌతున్నది. (సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 387) అని విమర్శకుల అభిప్రాయం శ్లోకాలు కూడా ఇంతే భావాన్ని తెలియజేస్తాయి. కాళిదాసాది కవులు పరిసరజ్ఞానాన్ని వివేచన చేసారు కాబట్టే నేటికీ వారి రచనలు ప్రజలకు హితమును అందిస్తూనే ఉంటాయి.

కాళిదాసు ఎంతో ఇష్టంగా హిమవత్పర్వతాలను వర్ణిస్తాడు.

మేఘసందేశం ప్రథమసర్గలో–

శ్లో॥ హేమామ్భోజ ప్రసవి సలిలం మానస స్యాదదానః

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

కుర్వన్ కామం క్షణముఖ పట ప్రీతి మైరావతస్య
ధున్వన్ కల్పద్రుమకిసలయాన్యంశు కాని స్వవాతై
ర్నానాచేష్టైర్జలద లలితైర్నిర్విశేస్తం నగేన్ద్రమ్॥ (66)

'ఓ జలదుడా! నీవు కైలాస పర్వతమునకు వెళ్ళినప్పుడు అచ్చటనున్న మానస సరోవరములో పుట్టిన బంగారు తామరల పుప్పొడి కలిసిన సుగంధభరితమైన, తీయని నీటిని త్రాగవచ్చు. నీవు నీటిని త్రాగుటకై తెల్లని నీరు కల మానస సరోవరములోనికి దిగినప్పుడు దేవేంద్రుని వాహనమైన తెల్ల ఏనుగు (ఐరావతము) ముఖముపై కప్పబడి ఉండు అలంకారవస్త్రమువలె అందముగా కనిపించెదవు. నీవు కదులుట వలన ఉద్భవించు, నీ చల్లని గాలులతో కల్పవృక్షములు, చిగురాకులను వస్త్రములను చలింపజేయుదువు. (జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ, ప్రథమసర్గ. 28) అని మేఘాలతో కూడిన హిమాలయ సొగసులను వర్ణిస్తాడు. సుపరిచితములైన హిమాలయములంటే ఆయనకు మక్కువ. అటువంటి అభిమానమే మనము కలిగి ఉండాలని ఆయన భావన అయ్యుండవచ్చు. వాటిని సంరక్షించే బాధ్యత మనం తీసుకోలేదు కాబట్టే, నేడు హిమాలయాల పరిసర ప్రాంతాలు, జోషిమఠ్ మొదలైనవి తీవ్ర సంక్షోభానికి గురవుతున్నాయి.

భవభూతి రచించిన 'ఉత్తర రామచరిత' 7 అంకాల నాటకం. ప్రథమాంకంలో రాముని ముగ్గురు తల్లులు అరుంధతితో ఋష్యశృంగానికి ద్వాదశ వర్షయజ్ఞంలో పాల్గొనడానికి వెళతారు. ఆనాడు ఆశ్రమాలలో నిర్వహించే యజ్ఞయాగాదులు ప్రకృతి పరిరక్షణకు, మానసిక ప్రశాంతతకు ఉపయోగపడేవే. తమసానదీతీరంలో క్రౌంచపక్షిని వధించిన వ్యాధునికి వాల్మీకి శాపమిచ్చినట్లు, బ్రహ్మ ప్రత్యక్షమై వాల్మీకిని రామాయణ కావ్యాన్ని రచించమని ఆదేశించినట్లు....' (సంస్కృత సాహిత్య చరిత్ర, పే. 463) తెలుస్తున్నది. పక్షిని వధించటం అధర్మమనే భావన ఈ ఘట్టం తెలియజేస్తుంది. పక్షులు మనతోపాటు జీవించవలసినవేనన్న విషయాన్ని గుర్తు జేస్తుంది.

విశాఖదత్తుని ముద్రారాక్షస నాటకంలోని ఆరవ అంకంలో తోటల వర్ణనలో మానవీయకోణం కనిపిస్తుంది.

శ్లో॥ క్షతాఙ్గానాం తీక్ష్ణైః పరశుభిరుదగ్రైః క్షితిరుహాం
రుజా కూజన్తీనా మలిరతకపోతోపరుదితైః
స్వనిర్మోకచ్ఛేదైః పరిచిత పరిక్లేశ కృపయా
శ్వాసన్తః శాఖానాం వ్రణమివ నిబధ్నన్తి ఫణినః (సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 339)

శ్లో॥ అన్తః శరీరపరిశోష ముదగ్రయన్తః
కీటక్షతిస్రుతిభిరస్రమివోద్వమన్తః
ఛాయావియోగమలినా వ్యసనే నిమగ్నా
వృక్షాః శ్మశానముపగన్తుమివ ప్రవృత్తాః (సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 340)

"తోట జీర్ణము–ముసలిది, చాల పాతవడిపోయిది. చెట్లు పెద్దవాడి గొడ్డళ్ళతో కట్టెలు మొదలైన వానిని కొట్టుకొని పోయినందున గంట్లు పడి యున్నవి. కొమ్మలలో, అవి పెద్దగాయలంబోలియున్నవి. వానిపై పావురాలు కూయుచుండ, ఆ కూతలు ఆ చెట్ల నొప్పి వలన యేడుపులంబోలియున్నవి. కొమ్మలపైకి పాములు ప్రాకి కుబుసము విడిచి పెనగొని బుసలు కొట్టుచున్నవి. అవి తమ పరిచితులైన మిత్రులగు చెట్లకును కొమ్మలకును కలిగిన గాయపు బాధలకు జాలిగాని ఆప్యాయముగా ఊదుచు, కుబుసలములతో గాయాలకు కట్లు కట్టినట్లున్నవి.

అన్నము నీరు లేక ఏడ్చుచు పీనుగుతో పడియున్నందున దేహములోని వాడుబాటును –ఎండబాఱుటను–వెలికి తెలుపుచు, పురుగుల కాట్ల బంకరసముతో కన్నీరు కార్చుచు, శాంతితఱిగిన దైన్యముచే ధూళి బ్రుంగి ముఱికిపడినవై

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:7(2), July, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఇట్లు (ఆబంధువియోగ) దుఃఖములో మునింగినవై – అట్టివారింబోలి – చెట్లు వల్లకాటికి పోవసమకట్టిన వియుంబోలెనున్నవి" (సంస్కృత సాహిత్యచరిత్ర, 1986 – పేజి. 340) చెట్లను మానవులుగానే భావిస్తూ (వర్ణిస్తు)న్న తీరు మానవ హృదయాలకు చెట్లను దగ్గర చేసేదిగా ఉంది. కళావిహీనమైన వృక్షాలు ఉన్న తీరు మానవులతో అభేదం చేయడం ఇక్కడ స్పష్టమవుతున్నది.

ప్రకృతిలోని ప్రాణికోటికి గాలిని, ఆశ్రయాన్ని అందించే చెట్లు నేడు ఈ పరిస్థితుల్లోనే ఉన్నాయి కదా! అభిజ్ఞానశాకుంతలాది కావ్యాలు మొక్కలను మనం ఎలా చేరదీయాలో తెలియజేస్తాయి. మేఘసందేశాది శ్రవ్యకావ్యాలు పర్వతాల వైశిష్ట్యాన్ని తెలియజేస్తాయి – నదులు ఎలా జీవనాధారాలో తెలియజేస్తాయి. ఈ కావ్యాల ద్వారా వనాలు స్వచ్ఛమైన ప్రాణవాయువునందిస్తూ వనచరాలకు ఆహ్లాదాన్ని కలిగించిన తీరును మనం తెలుసుకోవచ్చు. ఈ విధంగా ఆనాటి కావ్యాలన్నీ పరోక్షంగా జీవవైవిధ్యాన్ని నేర్పించినవే. ఇదే ఇప్పటి మన జీవన వేదం.

**వనమూలమిదమ్ జగత్.**

## ఉపయుక్త గ్రంథసూచి

1. కృష్ణమాచార్యులు, ఎమ్. మరియు వేంకటరామయ్య, గోలి (అను) మహాకవి శ్రీ వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాయణము. అయోధ్యాకాండము–2007. గీతాప్రెస్, గోరఖ్‌పూర్ (భారతదేశం)
2. గోపాలకృష్ణ. రెంటాల, కాదంబరి(వచన రచన), సంస్కృతమూలం: మహాకవి బాణుడు, 1971. జయంతి పబ్లికేషన్స్, విజయవాడ–2
3. గోపాలరెడ్డి మరియు సుజాతారెడ్డి, ముదిగంటి, సంస్కృత సాహిత్య చరిత్ర, 1986. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్–4.
4. జి.వి.యస్. సుబ్రహ్మణ్యశర్మ (అను). శ్రీ కాళిదాసకృత అభిజ్ఞాన శాకున్తలమ్ మరియు మేఘసందేశః, శ్రీ గోపాల్ పబ్లికేషన్స్, హైదరాబాద్ –27
5. నరసింహశాస్త్రి, కేశవపంతుల (వ్యాఖ్యాత), కాళిదాసకృత రఘువంశం, 1988, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్–4.
6. భోగీశ్వరశర్మ, నోరి (అను), శ్రీమహాకవి కాళీదాస విరచితమ్, అభిజ్ఞానశాకున్తలమ్, యజమానమూర్తిః కొవ్వూరు (ఆం.ప్ర.)
7. రామదాసయ్యంగారు, నేలటూరు (వ్యాఖ్యాత), భవభూతి ఉత్తర రామచరిత నాటకమ్, 1965. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్–4
8. రామదాసయ్యంగారు, నేలటూరు (వ్యాఖ్యాత), విశాఖదత్త విరచిత ముద్రారాక్షస నాటకమ్, 1977. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్–4